# అలసిపోయిన ఆశయం

"ఏమంటున్నావు ప్రతిమా? నువ్వేనా ఈ మాటంటున్నది!" భార్యను ఆశ్చర్యంగా చూశాడు ప్రసాద్. 'అవునండి: మీ బుద్ధి కుశలతనంతా ఉపయోగించి అవసరమైతే ఎవరి కాళ్లయినా పట్టుకుని మరీ నన్ను ఉద్యోగస్తురాలిని చేయండి' ... అలా అంటున్నప్పుడామె గొంతు గద్గదికంగా పలికింది. 'ఎందుకు ఊరికే మనసు పాడు చేసుకుంటావు. ఈ మధ్య నేను ఎన్నిసార్లు అడిగినా నీ బాధకు కారణం చెప్పేవుకాదు. పైగా ఒక ఉద్యోగం చూడమంటున్నావు. నీ మనసు మధనం ఏమిటో ఇప్పుడైనా చెప్పవూ' లాలనగా ప్రతిమ భుజాన చేయివేశాడు. చల్లగాలి తాకిన పిల్ల మబ్బులా కరిగిపోయింది. పతిదేవుని హృదయంలో ఒదిగిపోయింది. ఆమె అలా బేలగా ఆవేదన పడుతుంటే అతనికి గుండెలు పిండేస్తున్నట్లు ఉంది. తామిద్దరూ భార్యాభర్తలై దశాబ్దం దాటుతున్నా ప్రతిమ ఎప్పుడూ ఇంతగా కన్నీరై కరిగిపోవడం ఎరుగడు అతను. ఇందుకు బలమైన కారణమే ఉండాలి. ఈ రోజు తను ఉద్యోగస్తురాలు కావాలని ఇంతగా వాంఛిస్తోంది. పదేళ్ల క్రితమే ప్రతిమలో ఈ కోర్కె ఉంటే తన ప్రక్క సీటే తన అర్ధాంగిదై ఉండేది. ప్రతిమ అభిప్రాయాలే వేరు. చదువుకు సార్థకత ఉద్యోగంతో రాదనీ, అర్హతలు వున్నంత మాత్రాన ప్రతీ యువతీ ఉద్యోగాలు చేయనక్కరలేదునీ, ఉద్యోగం మాత్రమే స్త్రీ అభ్యుదయానికి చిహ్నం కాదనీ అనేది. అయినా తను వూరుకున్నాడా! తను భావాలు వేరు. ప్రతిమ తనతోపాటు వుద్యోగం చేస్తేనే బావుండును. భార్యాభర్తలు జంటగా వుద్యోగాలు చేస్తూ జోడు గుర్రాల జీవిత రథాన్ని నడిపితే ఆర్థిక సమస్యలే ఉండవు. పగలంగా ఆఫీసు పనులతో అలసి ఇంటికి చేరిన తరువాత వంటింట్లో చేరి, చేయి కలిపి వేడివేడిగా వండుకుంటూ ఒకరి ఆఫీసు కబుర్లు ఒకరితో వాడి వాడిగా ముచ్చటించుకుంటూ వుంటే, అది అందమైన కాపురం. అప్పుడు ఎంతగా ఒక్క సెలవు రోజు కనీసం ఎదురు చూస్తారని. ఆరోజు కోసం ఎన్నెన్ని ప్రణాళికలని, మరెన్నో తీయని ఊహలని, ఆ హాలిడేని జాలీడేగా గడపడంలో ఎంత థ్రిల్. ప్రతిమ మూడ్ బావున్నప్పుడల్లా ఇలానే క్లాసు తీసుకునేవాడు. మరి ప్రతిమ బుద్ధిగా పాఠాలు వినే స్టూడెంట్‌లా వుందా! తనూ లెక్చర్ దంచేసేది.

'మీకు పైత్యం ముదిరినట్టుంది. కాస్త నానా రకాల కషాయాలు కాచి ఇస్తా తాగండి. కాఫీ టీలకి గుడ్‌బై చెబితే మంచిది.' అంటూ కిల కిలా నవ్వేది.

ఆమె ధోరణి ఎప్పుడూ మారేది కాదు. 'అయినా మీరు ఆఫీసులో ఒకే ఉద్యోగం చేస్తున్నారు. నేను చేసే ఉద్యోగాలు ఎన్నని, ఇల్లాలుగా ఇంటిని దిద్దుకోవాలి, నెచ్చెలిగా మిమ్మల్ని మురిపించాలి, అటు చూడండి: మన బుజ్జిగాడికైతే రోజంతా అమ్మగా వుద్యోగం చేయాలి.' అంటూ కవ్వించేది.

ఎన్నో అవకాశాలు ప్రతిమని కుర్చీలో కూర్చోపెడతానన్నాయి. మరెన్నో అదృష్టాలు తనని

వెదుక్కుంటూ వచ్చాయి. అన్నింటిని కాదంది. 'విద్యను ఆర్జించటం బుద్ధి వికసించటానికి, సమాజం అంటే ఏమిటో అవగాహన చేసుకోవటానికి, సంఘంలో ప్రతి పత్తిని పెంచుకోటానికి. అంతే కాని డిగ్రీలు చేతిలో వున్నాయని, అవి సంపాదనకే ఉపయోగపడి తీరాలని అనుకునేవాళ్ళు నా దృష్టిలో ఉత్త మూర్ఖులు. మీరెన్నైనా చెప్పండి. నేను ఉద్యోగం చేసే ప్రసక్తే లేదు.' కుండ బద్దలు కొట్టినట్టు చెప్పిన భార్య మాటను తోసిపుచ్చాలనిపించలేదు ప్రసాద్‌కి.

'ఏమోయ్, మీ ఆవిడ అంత చదువుకుంది, వేన్నీళ్ళకి చన్నీళ్ళలా ఓ వుద్యోగం' అని ఓ మిత్రుడంటే, 'అట్టే వాడితో మాట్లాకురా! వాడి పలుకుబడి ముందు మనమెంత? తలుచుకోవాలి గాని వాడి శ్రీమతిని వున్నపాటున ఓ ఆఫీసర్‌ని చేసేగలడు!' అని మరో మిత్రుడు. ' పోన్లే గురూ! మనకెందుకూ? చదువుకున్నవాళ్ళంతా సామర్థ్యం కలిగి వుండాలని ఎక్కడుంది? ఆవిడో మన్ను తిన్న పాపై వుంటుంది. లేకపోతే వీడికెందుకు ఓవర్ టైమ్ పాట్లు. నానా రకాలుగా మిత్రుల పరిహాసాలు అతని మనస్సుకి ములుకుల్లా తగిలేవి. భార్య చెప్పేదానిలో వాస్తవికత వుందనుకున్న అతను ఈ మాటలు లెక్కచేసేవాడు కాదు.

భార్య ఆశయానికి విలువనిస్తున్నాను. ఆమె అభిప్రాయాలను గౌరవిస్తున్నాను - అన్న తృప్తి చాలన్పించేది ప్రసాద్‌కి. తనంతనే ప్రతిమ ఎందుకిలా మారిపోయిందో! తను ఉద్యోగస్తురాలు కావాలని ఎందుకింతగా కోరుకుంటోందో!

'చెప్పు ప్రతిమా నీ... మనస్సులో ఏముందో! నీ ఆశయానికి వ్యతిరేకంగా ఎందుకు ఇలా అంటున్నావు?'

భర్త అలా అనేసరికి తన హృదయంలోని ఆవేదనంతా అతని ముందుంచింది. తన ఇద్దరి తోడి కోడళ్ళు, ఆడపడుచులిద్దరు పెద్దగా చదువుకోకపోయినా ఉద్యోగాలకి వెళుతున్నారు. ఎప్పుడు తను అత్తవారింటికెళ్ళినా -

'ఏమమ్మా! మరదలు పిల్లా! యం.యస్సి. కంప్లీట్ చేశావు, హాయిగా జాబ్ చేయకూడదూ?' అంటుంది పెద్దాడపడచు.

'రోజంతా కష్టపడాలని అన్నయ్య మీదే సంపాదన భారం పడేసి ఆనందంగా గడిపేస్తోంది వదిన' అని చిన్నాడపడుచు.

'ఆ: మనం సలహాలిచ్చే పాటివాళ్లమా! ఆవిడ కావాలని ఈ బాధ్యతలేవీ పెట్టుకోనప్పుడు మనం ఏం చెబితే చెవిన పెడుతుంది!' అంటూ తోడి కోడళ్ళు తన మనస్సును గాయపరిచినా ఎప్పుడూ పట్టించుకోలేదు.

బాబు స్కూలుకెడుతుంటే వాడికి చదువు చెప్పటమే కాక తోటి పిల్లలకు ట్యూషన్స్ చెప్ప సాగింది. అలా... కొంత టైము వెచ్చించి ప్రత్యేకం ఉద్యోగం అంటూ చేయకపోయినా తనూ సంపాదిస్తున్నానని, తన ఆశయం సంపాదనకు అవరోధం కాదని అనుకోసాగింది. ఒక్క క్షణం

కూడా వృథా చెయ్యకుండా కాలం గడుపుతున్న తనకి అందరూ- బద్ధకస్తురాలు- అనే బిరుదు ఇచ్చారు. మహిళా మండలి సమావేశాల్లో తను పాల్గొంటున్నప్పుడు ఏ మోస్తరు పరిస్థితి ఎదురౌతూ వచ్చింది? ఆఫీసర్ హోదాల్లో ఉన్నవాళ్ళ నుండి అతి చిన్న ఉద్యోగాలు చేస్తున్న వాళ్ల వరకు తనని తేలిక భావంతోనే చూస్తూ తన ఆశయానికి ఎన్నో అర్థాలు కల్పించారు.

'కడుపులో చల్ల కదలకుండా నీడ పట్టున కూర్చున్న వారికి ఉద్యోగినుల సాధక బాధకాలు ఏం తెలుస్తాయి? ఇంటి పని, ఉద్యోగం రెండిటితోను సతమతమవ్వడం అంటే అదొక సవాల్!' అంటూ తనకు అలసత్వాన్ని అంటగట్టారు.

ఆఖరికి పేరంటానికి వెళ్లినా పదవుల్లో ఉన్నవాళ్ళకి లభించే గౌరవం వేరు, తన బోటివారిని చూసే తీరు తెన్నులు వేరు. ఛ! ఛ! ఇదేం సమాజం అన్పించసాగింది.

ఇలా ఎన్నో సంఘటనలు ప్రతినిత్యం ఆమె మనసును కలచివేస్తూనే వున్నాయి. అక్కయ్యలిద్దరూ ఉద్యోగస్తులు కావడంతో ముచ్చటపడి పుట్టింటికెళ్ళినా మనస్తాపానికే గురయ్యేది. చీర సారెలు పెట్టడం మొదలు, నలుగురు కులాసాగా కబుర్లు చెప్పుకునేటప్పుడు కూడ ప్రతిమ విషయం వచ్చేసరికి-

' ఆ! తనకేమిటి? యింటిపట్టున ఉంటుంది. రోజూ ఆఫీసుకు వెళ్ళి చాకిరీ చేయవలసిన బాదరబందీ లేదు. నాలుగు రకాలు తెచ్చుకుని హాయిగా తింటూ కూర్చోవచ్చు. పుట్టింట్లో ప్రత్యేకం సుఖపడడం ఏముంది? అలా తనను వేరుగా చూస్తుంటే నాలుగు రోజులైనా ఉండబుద్ధి పుట్టేది కాదు. తను ఊహించని వింత పరిస్థితులు ఎన్ని రకాలుగా ఎదురవుతున్నాయో!

వెళ్లేటప్పుడు 'ప్రతిమకేగా! ఎలాంటి చీర పెట్టినా పరవాలేదు. అదెక్కడికి వెళ్ళాలి?' అని అమ్మ అంటే వదిన బొట్టుపెట్టి ఓ ముతక చీర తన చేతుల్లో ఉంచేది. అన్నింటినీ ఆవలకు నెట్టి తన ఆశయాన్ని నెరవేర్చుకుంటున్నాను అని తృప్తి పడేది. ఆ తృప్తి మాత్రం తనకు మిగలదని పూర్తిగా తెలిసిపోయింది.

'వదినా! నువ్వు ఎప్పుడూ ఇంట్లోనే వుంటావుగా! మా పిల్లలిద్దరూ కాస్త బుద్ధిమంతులే లే! నీ దగ్గర ఉంచుకొని బుజ్జిగాడితోపాటు చదివించు, నాకు ఆఫీసు పనితో వాళ్లని చూచుకోవడం అసలే కుదరడం లేదు' అంది.

ప్రతిమ అవాక్కయి ఉండిపోయింది. తన చిన్న ఆడబడుచు చేస్తున్నది అతి చిన్న ఉద్యోగం. మానేసి ఆవిడే తన పిల్లల సంగతి చూచుకోవచ్చుగా! తను అందరికీ యింత చులకనై పోయిందా! తను ఉద్యోగం చెయ్యకపోవటమేనా యిందుకు కారణం! ప్రతిమ మనస్సులో ఆశయం పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. 'నేనూ ఉద్యోగంలో చేరబోతున్నానమ్మా! యింక ఖాళీగా వుండతలుచుకోలేదు' అనేసింది అప్రయత్నంగా. ఆ మాట నిజం చేసుకోవాలనే యిప్పటి తన పట్టుదల.

భార్య ఆంతర్యం అవగతమైన ప్రసాదు ఆశ్చర్యం నుండి తేరుకోవడానికి చాలా సేపే పట్టింది. 'నేనివన్నీ ఊహించలేదు ప్రతిమా! నీ బాధ ఏమిటో నువ్వు చెప్పేదాకా అర్థం చేసుకోలేక పోయాను'.

'అందుకే కదా, మిమ్మల్ని యింతగా ప్రాధేయపడుతున్నాను! ఎలాగైనా నాకో ఉద్యోగం...'

'అక్కడే పొరపడుతున్నావు'.

'లేదండీ! యిన్నాళ్ళూ నేను చేసిందే పొరపాటు. నేను ఓ ఉద్యోగస్తురాలినైతే అన్ని రకాలుగా గౌరవాన్ని పొందుతాను' అంది ఆశగా భర్త ముఖంలోకి చూస్తూ.

పిచ్చి ప్రతిమా! యిప్పుడు నీ గౌరవ ప్రతిష్ఠలకేమీ కొరత రాలేదు. యివన్నీ లెక్కచెయ్యకుండా నీ ఆశయాన్ని అలిసిపోనివ్వక హాయిగా కాలం గడుపు. నిజానికి ఉద్యోగిని నిర్వర్తించే బాధ్యతల కన్న, గృహిణే ఎక్కువ బాధ్యతలు పైన వేసుకుంటోం దంటాను నేను. నిన్ను చూస్తుంటే నాకు అలానే అనిపిస్తోంది. తన వారినందరినీ సుఖపెడుతూ వాళ్ల ఆనంద సౌఖ్యాల కోసం సాయపడుతూ యిల్లాలు ఎంతో శ్రమిస్తోంది. తప్పనిసరి అయితేనే స్త్రీ ఉద్యోగం చేయాలి గాని ఊరికే దాని కోసం ఆరాట పడనక్కరలేదు. నువ్వేదో ఖాళీగా కూర్చున్నావని నీకు పనులప్పగించే వాళ్లకీ, ఇంట్లోనే ఎక్కువ టైము గడుపుతావు కనక నీకు శుభ్రతా హుందా లేవనుకొనే వాళ్లకీ తగిన విధంగా బుద్ధి చెప్పు. నీ అస్తిత్వాన్ని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని వాళ్లకి తెలియచెయ్యి. నేను కోరనంత కాలం నువ్వు సంపాదించే అవసరం లేదు కదా...'

●